సాక్షి ములుగు

బుధవారం । 2 । జూలై । 2025



అడ్డుకుంటున్నది ఎవరు?
టీజీఎన్పీడీసీఎల్‌లో వాచ్‌మన్, స్వీపర్‌ల విభజన కాకుండా తెర వెనుక ఎవరో అడ్డుకుంటున్నారని విద్యుత్ ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. - 8లో▸



సర్టిఫికెట్ల పరిశీలన షురూ..
ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు గాను వరంగల్ పట్టణంలోని పలు హెల్ప్‌లైన్ సెంటర్లలో మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. - 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
30⁰ /24⁰
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

ఆ.. జలపాతాల సందర్శన నిషేధం

అటవీ, పోలీస్ అధికారుల నిర్ణయం



బొగతకు రావాలంటూ పిలుపు

తెలంగాణ నయాగరాగా పేరుగాంచిన బొగత జలపాతానికి ఎలాంటి ఇబ్బందులూ లేవని, పర్యాటకులు తరలి రావాలని అధికారులు కోరుతున్నారు. అన్ని సౌకర్యాలున్న ఈ జలపాతాన్ని పర్యాటకులు వీక్షించాలని ఆహ్వానిస్తున్నారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ కూడా బొగత జలపాతాన్ని వీక్షించాలని పిలుపునిచ్చారు. ఇక్కడికి రోజురోజుకూ పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ మండలంలో సరైన వర్షం లేకపోవడంతో పూర్తిస్థాయిలో జాలువారడం లేదు.

- రక్షణ లేకపోవడం.. గత ప్రమాదాలే ప్రధాన కారణం
- దారులు మూసి.. కాపలాగా ఉన్న సిబ్బంది
- బొగత జలపాతానికి రావాలంటూ పిలుపు

వాజేడు: గతంలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో దండకారణ్యంలోని పలు జలపాతాల సందర్శనకు అటవీశాఖ, పోలీసుల అధ్వర్యంలో బ్రేకులు వేశారు. ములుగు జిల్లాలో ప్రాచుర్యం పొందని జలపాతాల సందర్శనకు పర్యాటకులు రావద్దని కోరుతూ నిషేధం విధించారు. దీంతో గుట్టల సమీపంలో ఉన్న జలపాతాలను సందర్శించడం ఇక కష్టం కానుంది.

రక్షణ లేకపోవడంతోనే..
దుసపాటి లొద్ది, మాసన్ లొద్ది, గుండం, ముత్యం ధార, భామన సిరి జలపాతాలు నట్టడవిలో ఉన్నాయి. ఇక్కడికి చేరుకోవాలంటే చాలాదూరం అడవిలో కాలినడకన వెళ్లాలి. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఉండవు. ఇవి ఇంకా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందలేదు. దీంతో ఇక్కడికి అష్టకష్టాలు పడి వెళ్లిన పర్యాటకులు ప్రమాదాలకు గురైన సందర్భంలో సమాచారం బయటికి తెలిసే అవకాశం ఉండడంలేదు. దీంతో స్థానిక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఈ జలపాతాల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు, సౌకర్యాలు లేవు. దీంతో అటవీశాఖ సిబ్బంది వీటిని నిషేధించడంతోపాటు ఇక్కడికి పర్యాటకులు వెళ్లొద్దని అటువైపు వెళ్లే దారులను బారికేడ్లు పెట్టి మూసివేశారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దొంగ దారిలో వెళ్లకుండా సిబ్బందిని కాపలాగా ఉంచారు.

నిషేధించిన జలపాతాలు ఇవే..
వాజేడు, వెంకటాపురం(కె) మండలాలను ఆనుకుని దండకారణ్యం, కర్రె గుట్టలు ఉన్నాయి. ఈ గుట్టలపైనుంచి జాలువారుతూ వాజేడు మండలంలో మరికొన్ని జలపాతాలు ఉన్నాయి. కొంగాల సమీపంలో దుసపాటిలొద్ది, కృష్ణాపురం సమీపంలో భామనసిరి, దూలాపురం సమీపంలోని మాసన్‌లొద్ది, అరుణాచలపురం సమీపంలో గుండం, వెంకటాపురం(కె)లో ముత్యంధార జలపాతాలు ఉన్నాయి. ఇవి ఇంకా ప్రాచుర్యం పొందలేదు. కానీ, బొగత జలపాతం సందర్శన వచ్చే పర్యాటకులు ముఖ్యంగా యువత ఎక్కువగా ఈ జలపాతాలను తిలకించడానికి ఉత్సుకత చూపిస్తున్నారు. నిషేధం ఉందని తెలిసినా వెళ్తున్నారు.

నిషేధిత జలపాతాలకు వెళ్లొద్దు



దట్టమైన అటవీప్రాంతంలోని ప్రమాదకర జలపాతాల సందర్శనకు అనుమతులు లేవు. అనవసరంగా పర్యాటకులు వెళ్లి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దు. ప్రమాదం జరిగితే రక్షించడానికి ఆ సమయంలో ఎవరూ అందుబాటులో ఉండరు. ఈ విషయాన్ని పర్యాటకులు గుర్తుంచుకుని మాకు సహకరించాలి.
- ద్వాలియా, ఎఫ్‌డీఓ, వెంకటాపురం(కె))



దుసపాటి లొద్దికి వెళ్లకుండా ఉన్న సిబ్బంది, సూచనలు చేస్తున్న ఎఫ్‌డీఓ



గుండంజలపాతానికి వెళ్లకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కాపలా ఉన్న సిబ్బంది

న్యూస్‌రీల్

జిల్లా విద్యాశాఖ అధికారిగా చంద్రకళ



ములుగు రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారిగా దురిశెట్టి చంద్రకళను నియమించినట్లు కలెక్టర్ టీఎస్.దివాకర మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డీఈఓగా పనిచేసిన పాణిని గత నెల 16న లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కడంతో కస్టడీకి తీసుకున్నారు. అనంతరం హనుమకొండ డీఈఓగా పనిచేస్తున్న వాసంతికి అదనపు బాధ్యతలు అప్పగించగా ఆమె విధుల్లో చేరలేదు. దీంతో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న దురిశెట్టి చంద్రకళకు డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

బహిరంగసభను విజయవంతం చేయాలి



ములుగు రూరల్: ఈ నెల 4న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



ఏటూరునాగారం: పోడు భూములకు పట్టాలివ్వాలని గ్రామీణ పేదసంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ కార్యదర్శి మొగిలిచర్ల వీరస్వామి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఐటీడీఏలో గల కొమురం భీమ్ విగ్రహం ఎదుట నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఐటీడీఏ ఏపీఓ వసంతరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన గిరిజనులు పోడు చేసుకున్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. పేద రైతులపై పోలీసులు, అటవీశాఖ అధికారులు దాడులు చేయడం ఆపాలన్నారు. అలాగే సాగులో ఉన్న భూముల్లో బోర్లు, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు, తాగునీటి వసతులు కల్పించాలన్నారు. మంగపేట మండల పరిధిలోని చింతకుంట, నిమ్మగూడ, తిమ్మాపురం, రాళ్లగుంపు, ముసలమ్మతోగు, కేశవపురం తదితర గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే ఐటీడీఏను ముట్టడిస్తామని హెచ్చరించారు. అర్హులైన గిరిజన రైతులకు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యల వెంకటేశ్వర్లు, కన్నయ్య, సుధాకర్, సరిత, రాంబాబు, ఆదిలక్ష్మి, సావిత్రి, సుగుణ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో రోడ్డు పక్కన పడేసిన చెత్త



సాక్షి ఫోకస్

పల్లెల్లో పడకేసిన ప్రత్యేక పాలన

పంచాయతీల వైపు కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు
- పంచాయతీ కార్యదర్శులే నెట్టుకొస్తున్న వైనం
- నిధుల్లేక కుంటుపడుతున్న గ్రామాల అభివృద్ధి



వెంకటాపురం(ఎం) గ్రామపంచాయతీ కార్యాలయం



మండల కేంద్రంలో బురదమయమైన సీసీ రోడ్డు

వెంకటాపురం(ఎం): పంచాయతీల్లో ప్రత్యేక పాలన పడకేసింది. జీపీల్లో విధులు నిర్వర్తించాల్సిన ప్రత్యేకాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో గ్రామాలాభివృద్ధి, ప్రజల సంక్షేమం గాలిలో దీపంలా మారి పల్లెలన్నీ మసకబారిపోతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వెంటనే గ్రామాల్లో పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరవేస్తూ, గ్రామాల్లో సమస్యలు పరిష్కారించాల్సిన ప్రత్యేకాధికారులు జీపీలను పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే అన్నీ తామై గ్రామ పంచాయతీలను నెట్టుకొస్తున్నారు.

కనిపించని అభివృద్ధి
పంచాయతీల పాలకవర్గం గడువు ముగియడంతో ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు లేకపోవడంతో గ్రామాలాభివృద్ధి కుంటుపడుతోంది. గత పాలకవర్గాలు చేసిన పనులకే ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు లబోదిబోమంటున్నారు. ఒక్కొక్క గ్రామపంచాయతీకి సుమారు రూ.2 లక్షల నుంచి 20 లక్షలకు పైగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. జిల్లాలోని 174 గ్రామపంచాయతీలకు సుమారుగా రూ.20 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు మాజీ సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. 2023 సెప్టెంబర్ నుంచి చేసిన పనులకు బిల్లులు రాలేదని వారు వాపోతున్నారు. అంతేకాకుండా ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులు సైతం అప్పులు చేసి గ్రామాల నిర్వహణ కొనసాగిస్తున్నారు. తాగునీటి పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, గ్రామాల్లోని చెత్తను ట్రాక్టర్‌ల ద్వారా డంపింగ్‌కు చేరవేయడం లాంటి పనుల కోసం పంచాయతీ కార్యదర్శులు సొంతంగా ఖర్చు చేస్తున్నారు. ఖర్చు చేసిన డబ్బులకు బిల్లులు పెట్టి ఎస్‌టీఓలకు చెక్కులు పంపుతున్నప్పటికీ చెక్కులు పాస్ కావడం లేదని కొంతమంది కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో లక్షలు వెచ్చించి గ్రామాల నిర్వహణ కొనసాగిస్తుండడంతో పాటు విధుల నిర్వహణ భారంగా మారిందని వాపోతున్నారు. నెలసరి వచ్చే వేతనం కూడా పంచాయతీ అభివృద్ధికే ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి నెలకొందని కార్యదర్శులు పేర్కొంటున్నారు.

కనిపించని ప్రత్యేకాధికారులు
జిల్లా వ్యాప్తంగా 10 మండలాల పరిధిలో 174 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇటీవల ములుగు మున్సిపాలిటీలో మూడు పంచాయతీలు విలీనం కావడంతో పంచాయతీల సంఖ్య 171కి చేరింది. 2024 ఫిబ్రవరి 1న పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో మరుసటి రోజున ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. మండలానికి జిల్లా స్థాయి అధికారి, గ్రామాలకు సీనియర్ అసిస్టెంట్ నుంచి పైస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించడంతో వారు బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీల్లో ప్రత్యేక పాలన సుమారుగా 18 నెలలుగా కొనసాగుతున్నప్పటికీ ప్రత్యేకాధికారులు పంచాయతీలకు వచ్చి విధులు నిర్వహించిన దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యక్రమం ఉన్నప్పుడు తప్పా ఇతర రోజుల్లో పంచాయతీ విధులకు హాజరు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రత్యేకాధికారులు ఎప్పుడు వస్తారో తెలియదు



గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేకపోవడంతో ప్రజా సంక్షేమం గాలిలో దీపంలా మారింది. గ్రామాల్లో ప్రత్యేక పాలన అటకెక్కింది. ప్రత్యేకాధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని దుస్థితి నెలకొంది. పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడి పల్లెలన్నీ కంపుకొడుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి.
- భూక్య జవహర్‌లాల్, నల్లగుంట, వెంకటాపురం(ఎం)

రూ. 19 లక్షలు రావాల్సి ఉంది



వెంకటాపురం(ఎం) సర్పంచ్‌గా ఉన్న సమయంలో రూ.19లక్షలు ఖర్చుపెట్టి అభివృద్ధి పనులు చేశాను. పంచాయతీకి ప్రహరీ నిర్మాణం, సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా వీధి దీపాల ఏర్పాటు, గ్రావెల్ పనులు చేసినప్పటికీ ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. చేసిన పనులకు గాను ఎంబీ రికార్డులు సైతం ఉన్నాయి. రెండేళ్లుగా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.
- మేడబోయిన అశోక్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు వెంకటాపురం(ఎం)

విపత్తుల సమయంలో సహాయక చర్యలు

కలెక్టర్ టీఎస్.దివాకర



ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి సూచనలిస్తున్న కలెక్టర్

ములుగు రూరల్: విపత్తుల సమయంలో ప్రాణనష్టం జరగకుండా సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి కలెక్టర్ దివాకర సూచించారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం జిల్లాకు వచ్చిన సందర్భంగా కలెక్టర్ తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ మహేందర్‌జీతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రామప్ప, లక్నవరం సరస్సు, గోదావరి నది, జంపన్న వాగు నీటిప్రవాహం, గతంలో చోటుచేసుకున్న సంఘటనల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 28 మందితో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం వర్షాకాలం ముగిసే వరకు జిల్లాలో ఉంటుందని తెలిపారు. గోదావరి నది, జంపన్న వాగు పరిసర ప్రాంతాలతో పాటు ఊరట్టం, నార్లాపూర్, మేడారం నీటి ప్రవాహ ప్రాంతాలను పరిశీలించి వరదలు వచ్చిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బృందానికి కావాల్సిన ఏర్పాట్లను సమకూర్చాల్సిందిగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీపీఓ దేవరాజు, కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకులు శివకుమార్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి
గోవిందరావుపేట: బాల కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ దివాకర అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల రోజులు పోలీస్‌శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మికశాఖ చైల్డ్ హెల్ప్‌లైన్, మహిళా సంక్షేమశాఖ అధికారులు సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా బాల కార్మికులను గుర్తించి బాలలను రక్షించాలన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్, డీఎంహెచ్ఓ గోపాల్ రావు, జిల్లా హార్టికల్చర్ అధికారి సంజీవ రావు, సర్వశిక్షా అభియాన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాజు, అగ్రికల్చర్ ఆఫీసర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథస్వామి అలంకరణలో రామలింగేశ్వరస్వామి



విశ్వనాథస్వామి అలంకరణలో దర్శనమిస్తున్న రామలింగేశ్వరస్వామి

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయంలోని రామలింగేశ్వరస్వామి మంగళవారం విశ్వనాథస్వామి అలంకరణలో భక్తులకు, పర్యాటకులకు దర్శనమిచ్చినట్లు ఆలయ పూజారి ఉమాశంకర్ తెలిపారు. ఆషాఢమాసం సందర్భంగా స్వామివారు ప్రతిరోజూ ఒక్కొక్క అలంకరణలో దర్శనమివ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా పర్యాటకులు రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరుని చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

వైద్యవృత్తికి ఎంతో గౌరవం

డీఎంహెచ్ఓ గోపాల్‌రావు



కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్ఓ గోపాల్‌రావు

ములుగు రూరల్: సమాజంలో వైద్య వృత్తికి ఎంతో గౌరవం ఉందని డీఎంహెచ్ఓ గోపాల్‌రావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం జాతీయ డాక్టర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ కేక్ కట్ చేసిన అనంతరం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యాధికారులందరూ వైద్య వృత్తికి న్యాయం చేయాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ నియంత్రణకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వ్యాధులను అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీకాంత్, పవన్‌కుమార్, చంద్రకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

- జిల్లా హార్టికల్చర్ అధికారి సంజీవరావు



మాట్లాడుతున్న సంజీవరావు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా హార్టికల్చర్ అధికారి సంజీవరావు అన్నారు. మండల కేంద్రంతో పాటు నార్లాపూర్‌లోని రైతు వేదికల్లో ఉద్యాన శాఖ, కేఎస్ బయోసైన్స్ ఆయిల్‌పామ్ కంపెనీ వారి అనుబంధంతో రైతులకు మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సరిపడా నూనె ఉత్పత్తి లేదని తెలిపారు. దేశంలో 259 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ వినియోగం అవసరం కాగా 97లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతుందని తెలిపారు. దీంతో ఇతర దేశాల నుంచి నూనె దిగుమతి చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఇతర దేశాల నుంచి దిగుమతి తగ్గించి మన రైతులు ఆయిల్‌పామ్ పంటల సాగుపై దృష్టి సారిస్తే అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. అదే విధంగా రైతులు పండ్లు, కూరగాయలు సాగుచేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి శ్రీకాంత్, ఆయిల్ పామ్ కంపెనీ ఏరియా మేనేజర్ హేమంత్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ అనిరుద్, ఏఈఓలు రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

‘దేవాలయాల అభివృద్ధికి మంత్రుల కృషి’

ములుగు రూరల్: దేవాలయాల అభివృద్ధికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ ఎనలేని కృషి చేశారని కిసాన్ కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజీఎఫ్ నిధుల నుంచి రూ.1.42కోట్లు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయని వెల్లడించారు. ఈ మేరకు గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ జానకి రామాలయానికి రూ.12లక్షలు, కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ ఆలయానికి రూ.50లక్షలు, ములుగు మండలం జగ్గన్నపేట పుట్టా మల్లిఖార్జున స్వామి దేవాలయానికి రూ.30లక్షలు, మల్లంపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.20లక్షలు, ములుగు పట్టణంలోని నాగేశ్వరస్వామి దేవాలయానికి రూ.20లక్షలు, రామాలయానికి రూ.10లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. త్వరలోనే ఆలయాల అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి అప్పగించనున్నట్లు వెల్లడించారు.

ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలి

అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు రూరల్: 15 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలని అదనపు కలెక్టర్ సంపత్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఓపెన్ స్కూల్ ఉల్లాస్ ఆధ్వర్యంలో డీఆర్‌డీఓ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను అక్షరాస్యతలో ముందంజలో ఉంచాలన్నారు. అందుకు గాను సెర్ప్, జిల్లా విద్యాశాఖ, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలు సంయుక్తంగా కృషి చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు వాలంటీర్లను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఏపీడీ వెంకటనారాయణ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ సదానందం, ఉల్లాస్ ఏపీఎం వేణుగోపాల్, ఏసీజీ జయదేవ్, సీఎంవో సాంబయ్య, సమగ్ర శిక్షణ కో ఆర్డినేటర్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డకు ప్రాణహిత వరద



కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహితనది గుండా వరద ప్రవాహం తరలిరావడంతో మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీకి వరద తాకిడి పెరుగుతుంది. మంగళవారం సాయంత్రం వరకు 12,600 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా.. బ్యారేజీలోని మొత్తం 85గేట్లు ఎత్తి దిగువకు తరలిస్తున్నారు.

రాయితీపై యంత్రాలు

ఎస్ఎస్‌తాడ్వాయి : ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర రైతులకు సబ్సిడీపై యంత్రాలను అందించాలని గిరిజనేతర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీడి బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నార్లాపూర్ గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పంటలు సాగుతున్న భూములకు పట్టాలు లేని గిరిజనేతర సన్న, చిన్న కారు రైతులకు ప్రభుత్వ రాయితీపై ఆయిల్ పామ్ మొక్కలు, పూలు, పండ్ల మొక్కలను అందించాలన్నారు. మంత్రి సీతక్క గిరిజనేతర రైతులకు రాయితీ పథకాలు అందించేలా చూడాలని కోరారు.

క్లుప్తంగా

హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు..

వరంగల్ లీగల్ : భార్య, కొడుకుతో గొడవపడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్యను హత్య చేసిన ఘటనలో నేరం రుజువుకావడంతో కాజీపేట మండలం అమ్మవారిపేటకు చెందిన నేరస్తుడు మైదం కొమురయ్యకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావు మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమురయ్య తన భార్య సంతోష, కుమారుడు రాజేశ్‌తో తరుచూ గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో తనను సరిగ్గా చూసుకోవడం లేదని 2024, డిసెంబర్ 19న భార్య సంతోష, కుమారుడు రాజేశ్‌పై గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేశారు. అయితే పెద్దలు కొమురయ్యను మందలించి సక్రమంగా ఉండమని చెప్పి పంపించారు. అక్కడి నుంచి ఇంటికొచ్చిన రాజేశ్.. తన భార్యాపిల్లలను తీసుకుని అత్తాగారిల్లు అల్లిపురం గ్రామానికి వెళ్లి తాను కూలీకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చిన(అమ్మవారిపేట) రాజేశ్ భార్య ఇంట్లో జరుగుతున్న దృశ్యం చూసి భయాందోళనకు గురైంది. ఒంటరిగా ఉన్న సంతోష మెడకు కొమురయ్య తాడు కట్టి హత్య చేస్తుండగా చూసి కేకలు వేయగా కొమురయ్య పరారయ్యాడు. వెంటనే తన భర్త రాజేశ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందజేసింది. రాజేశ్ వచ్చి చూడగా తన తల్లి సంతోష మృతి చెందింది. దీంతో ఈ ఘటనపై రాజేశ్ మడికొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హత్యానేరం కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. కొమురయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను విచారించి కోర్టు నేరం రుజువు కావడంతో కొమురయ్యకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు తీర్పు వెల్లడించారు. కేసును పోలీసు అధికారులు సీఐ కిషన్ పరిశోధించగా లైజన్‌ఆఫీసర్ కరుణాకర్, పరమేశ్వర్ పర్యవేక్షించారు. హెడ్‌కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్ వీరగోని రాజేశ్, హోంగార్డు సదానందం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాము కేసు వాదించారు. కాగా, క్రిమినల్ చట్టాల మార్పు చెందిన తర్వాత భారతీయ న్యాయ సన్నిహిత కింద జూలైలో శిక్ష పడిన తొలి కేసు కావడం విశేషం.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

బయ్యారం: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని కొత్తపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాపనపల్లి నర్సింహ(45) పన్నెండు సంవత్సరాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. నాలుగు నెలల క్రితం భార్యాభర్తల మధ్య వివాదం చోటు చేసుకోగా నర్సింహ తన స్వగ్రామం కొత్తపేటకు వచ్చి మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య కాపురానికి రావడం లేదని సోమవారం రాత్రి గడ్డిమందు తాగగా కుటుంబసభ్యులు గమనించి మహబూబాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

అడ్డుకుంటున్నది ఎవరు?

టీజీ ఎన్పీడీసీఎల్‌లో నిలిచిన వాచ్‌మెన్, స్వీపర్ పోస్టుల బైఫర్‌కేషన్



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

- ఫలితంగా రక్షణ, పరిశుభ్రతకు నోచుకోని నూతన విద్యుత్ కార్యాలయాలు
- జిల్లాల పునర్విభజనతో సంస్థ పరిధిలో పెరిగిన సర్కిళ్లు
- డివిజన్, సబ్ డివిజన్లు, ఈఆర్‌ఓల పునర్విభజన పూర్తి
- ఇంకా పూర్తికాని క్షేత్రస్థాయి పోస్టుల విభజన

హన్మకొండ: సాధారణంగా ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో కచ్చితంగా వాచ్‌మెన్, స్వీపర్‌ను నియమిస్తారు. ఎందుకంటే ఆ కార్యాలయానికి సంబంధించి ఆస్తుల కాపలాకు వాచ్‌మెన్, నిరంతరం పరిశుభ్రంగా ఉంచడానికి స్వీపర్ ఉంటారు. అయితే రాష్ట్రంలో రెండు విద్యుత్ పంపిణీ సంస్థల్లో ఒక్కటైన టీజీ ఎన్పీడీసీఎల్‌లో మాత్రం ఆ పోస్టులను ఇంకా విభజన చేయడం లేదు. ఫలితంగా ఈ సంస్థ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కార్యాలయాలకు కాపలా, పరిశుభ్రత కరువైంది. దీంతో అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. వాచ్‌మెన్, స్వీపర్‌ల విభజన కాకుండా తెర వెనుక ఎవరో అడ్డుకుంటున్నారని విద్యుత్ ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మిగతా ఉద్యోగుల విభజన పూర్తి చేసి వీరిని బైఫర్‌కేషన్ చేయకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరిగిన సర్కిళ్లు..

తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో పూర్వ వరంగల్ జిల్లా (సర్కిల్)లో నూతన సర్కిళ్లు, డివిజన్లు, ఈఆర్‌ఓలు, సబ్ డివిజన్లు, సెక్షన్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. పాలన సౌలభ్యం కోసం వీటిని ఏర్పాటు చేశారు. ఆయా కార్యాలయాలకు ఇంజనీర్లు, ప్రావెన్షియల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందిని సర్దుబాటు చేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. స్వీపర్, వాచ్‌మెన్‌ల బైఫర్‌కేషన్‌ను పట్టించుకోలేదు. ఫలితంగా వారు పాత కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తుండగా, నూతనంగా ఏర్పాటైన కార్యాలయాల్లో వాచ్‌మెన్‌లు, స్వీపర్లు లేక అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

డివిజన్ల వారీగా ఉద్యోగుల సర్దుబాటు..

నూతన కార్యాలయాల ఏర్పాటు తర్వాత ఉద్యోగుల విభజనకు 2018, జూన్‌లో సీజీఎం చైర్మన్‌గా ఎస్‌ఏఓగా కన్వీనర్, పూర్వ సర్కిల్ పరిధిలోని ఎస్‌ఈలు సభ్యులుగా కమిటీని నియమించి సర్కిల్ స్థాయిలో ఉద్యోగుల విభజన చేశారు. అదే విధంగా సీజీఎం చైర్మన్‌గా, డీఈ టెక్నికల్ కన్వీనర్, ఎస్‌ఈలు సభ్యులుగా నియమించిన కమిటీ.. డివిజన్ల వారీగా ఉద్యోగులను సర్దుబాటు చేసింది. కానీ స్వీపర్, వాచ్‌మెన్‌లను ముట్టు కోలేదు. పూర్వ ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో ఇంజనీర్లు, ప్రావెన్షియల్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్లను సర్దుబాటు చేశారు. కానీ ఒక్క పూర్వ వరంగల్ సర్కిల్‌లో స్వీపర్, వాచ్‌మెన్ లైన్‌మెన్ డ్రైవర్ పోస్టులను పట్టించుకోకుండా వదిలేశారు. ఆ తర్వాత 2022 ఏప్రిల్‌లో సర్కిల్ స్థాయిలో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్ల విభజన, సర్దుబాటుకు కమిటీ నియమించారు. అదే విధంగా డివిజన్ స్థాయిలో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్ పోస్టుల విభజన, సర్దుబాటు కోసం మరో కమిటీని నియమించారు.

మూడేళ్లు గడిచినా ఎలాంటి నిర్ణయం లేదు..

ఈ కమిటీలను నియమించి మూడేళ్లు గడిచాయి. అయినా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. చైర్మన్‌లుగా వ్యవహరించాల్సిన సీజీఎంలు మారినా, బదిలీల్లో ఎస్‌ఈలు, ఎస్‌ఏఓలు, డీఈ టెక్నికల్‌లు మారుతున్నారే కాని ఉద్యోగుల విభజన మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అక్కడే ఉంది. ఈ విషయాన్ని యాజమాన్యం కూడా సీరియస్‌గా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు.

వాచ్‌మెన్, స్వీపర్ పోస్టుల విభజనను విస్మరించిన యాజమాన్యం..

వాచ్‌మెన్, స్వీపర్ పోస్టుల విభజనను యాజమాన్యం విస్మరించినట్లు కనిపిస్తోంది. పూర్వ వరంగల్ జిల్లా (సర్కిల్) పరిధిలో టీజీ ఎన్పీడీసీఎల్ నాలుగు సర్కిళ్లు ఏర్పాటు చేసింది. హనుమకొండ సర్కిల్ ఆఫీస్ పూర్వ కార్యాలయంగా, నోడల్ కార్యాలయంగా పని చేస్తుండగా, వరంగల్, జనగామ, మహబూబాబాద్ తోపాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలను కలిపి భూపాలపల్లి సర్కిళ్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు డివిజన్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాలకు సబ్ ఇంజనీర్ స్థాయి నుంచి డివిజనల్ ఇంజనీర్ వరకు, జూనియర్ లైన్‌మెన్ నుంచి ఫోర్‌మెన్ వరకు, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వరకు అధికారులు, ఉద్యోగుల బైఫర్‌కేషన్ చేసి పోస్టులు మంజూరు చేసి భర్తీ చేసిన యాజమాన్యం.. వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులను విస్మరించిందని అధికారులు, ఉద్యోగులు విమర్శిస్తున్నారు.

టీజీఎప్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన షురూ..

- నాలుగు హెల్ప్‌లైన్ సెంటర్లలో వెరిఫికేషన్ ప్రక్రియ



వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినికి ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం టీజీఎప్‌సెట్-2025 ఎంపీసీ స్ట్రీమ్‌లో ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకుగాను కాకతీయ యూనివర్సిటీ, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లోని హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ప్రథమ దశలో ఇప్పటికే స్లాట్‌బుకింగ్ చేసుకున్న విద్యార్థులు ఆయా హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. స్లాట్ బుకింగ్ ప్రక్రియ జూన్ 28 నుంచి జూలై 7వ తేదీ వరకు ఉంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జూలై 8వ తేదీ వరకు కొనసాగనుంది. క్యాంపస్‌లోని అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ సెంటర్లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకున్న విద్యార్థులకు డైరెక్టర్ ప్రొఫెసర్ సీజే శ్రీలత, సహాయ కోఆర్డినేటర్ సురేశ్‌బాబు ధ్రువపత్రాలు అందజేశారు. తొలిరోజు 300 మంది విద్యార్థులకు వెరిఫికేషన్ చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ హెల్ప్‌లైన్‌సెంటర్‌లో ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.అలాగే, కేడీసీలోనూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగింది. వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ సర్టిఫికెట్ల వెఫికేషన్ చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. తొలిరోజు 400 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారని ప్రభాకర్ తెలిపారు.

నారాయణపురం రైతుల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న రైతులు

- సర్వే ప్రకారం పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్

కేసముద్రం: ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం తమకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ ధారావత్ రవితోపాటువ లువురు రైతులు మాట్లాడుతూ.. 2017లో గత ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 1,827 ఎకరాల పట్టాభూములను అటవీ భూములుగా పేర్కొంటూ తమ పట్టాలను రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీఓ 94 జారీ చేసి రైతు పేరు, తండ్రి పేరు చోట వస్తున్న 'అడవి' అనే పదం తొలగించిందన్నారు. ఆ తర్వాత తమ గ్రామంలో అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించారన్నారు. ఈ సర్వే ఆధారంగా తమకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. 2022 నుంచి టీఎం 33 మాడ్యుల్‌లో 145 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తే సుమారు 500 ఎకరాలకు పట్టాదార్ పాస్ పుస్తకాలు వచ్చే అవకాశం ఉన్నా రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. 7 ఏళ్లుగా పాస్‌పుస్తకాలు లేకపోవడంతో తామకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పాస్‌పుస్తకాలు అందించాలని, లేనిపక్షంలో రిలే నిరాహారదీక్షలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మీపతి, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అమరేందర్‌రెడ్డి, లచ్చు, భీమా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: వర్షాకాలంలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్లు, నోడల్ జీఎంల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ అంతరాయాలు ఏర్పడిన వెంటనే పునరుద్ధరించేలా మెన్, మెటీరియల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. వచ్చే మూడు నెలల్లో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న లూజు లైన్లు, వంగిన పోల్స్, తుప్పు పట్టిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచడం, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్ వచ్చే వాటిని గుర్తించి సరి చేయాలని ఆదేశించారు. 16 సర్కిళ్ల పరిధిలో కొత్తగా వ్యవసాయ కనెక్షన్లు పెరుగుతున్నాయని, అందుకు తగట్లు రిలీజ్ వేగవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని సీఈలను ఆదేశించారు. విద్యుత్ బిల్లుల వసూళ్లు వందశాతం జరిగేలా నోడల్ జనరల్ మేనేజర్లు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు వి. మోహన్ రావు, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, వి. తిరుపతిరెడ్డి, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, బి.అశోక్ కుమార్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, ఆర్.చరణ్ దాస్, మాధవరావు, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

మెడకు బెల్ట్ బిగించి.. కాళ్లను చున్నీతో కట్టేసి..

- ఫైనాన్స్ వ్యాపారిని హత్య చేసిన నిందితులు
- ఇద్దరి అరెస్ట్.. 16.5 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పోలీసులు



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

కాజీపేట : మెడకు బెల్ట్ బిగించి.. కాళ్లను చున్నీతో కట్టేసి.. కూరగాయలు కోసే కత్తితో ఫైనాన్స్ వ్యాపారిని దారుణంగా హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 16.5 తులాల బంగారం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కాజీపేట పీఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి.. సీఐ సుధాకర్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. వరంగల్ శివనగర్‌కు చెందిన త్రిపురాధి నవీన్‌కుమార్ (55) చిరువ్యాపారులకు ఫైనాన్స్ ఇస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో సహజీవనం చేస్తున్న ఇద్దరు రైల్వే ఉద్యోగులు గుండా రజని(ఇందులో ప్రస్తుతం రజనీ ఉద్యోగం కోల్పోయింది.) , గడ్డం ప్రవీణ్‌కుమార్.. నవీన్‌కుమార్ వద్ద రూ.30 వేల అప్పు తీసుకున్నారు. అసలు, వడ్డీ కలిపి రూ.50 వేలకు పెరిగింది. ఈ డబ్బు చెల్లించాలంటూ నవీన్‌కుమార్ కొంత కాలంగా ప్రవీణ్‌కుమార్‌ను వేధిస్తున్నాడు. అప్పటికే పలు నేరాలతో సంబంధం ఉండి జైలుకెళ్లొచ్చి ఉద్యోగం కోల్పోయిన రజని, ప్రవీణ్‌కుమార్.. నవీన్‌కుమార్‌పై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకోవాలనుకున్నారు. ఏ విధంగానైనా ఫైనాన్స్ వ్యాపారిని హత్య చేసి ఆభరణాలు కాజేసి కుటుంబ అప్పులు, అవసరాలు తీర్చుకోవాలని భావించి నవీన్ కుమార్‌కు శుక్రవారం ఫోన్ చేసి రైల్వే క్వార్టర్స్‌కు పిలిపించారు. అయితే అప్పు చెల్లిస్తారనే నమ్మకంతో వచ్చిన వ్యాపారి నవీన్‌కుమార్ మెడకు ప్రవీణ్ బెల్ట్ బిగించి ఊపిరి ఆడకుండా చేయగా, రజని కాళ్లను చున్నీతో కట్టివేసింది. అనంతరం కూరగాయలు కోసే కత్తితో పొడవడంతో పాటు బండరాయితో తలపై మోది నవీన్‌కుమార్‌ను హత్య చేశారు. తర్వాత నిందితులు మృతదేహాన్ని మాయం చేయాలని భావించగా ఎవరూ సహకరించకపోవడంతో చేసేదేమి లేక పరారయ్యారు.

హత్య అనంతరం పరారైన రజని..

ఫైనాన్స్ వ్యాపారి నవీన్‌కుమార్‌ను హత్య చేసిన అనంతరం రజనీ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మర్రిగూడెం గ్రామానికి చేరుకుంది. ప్రవీణ్ పట్టణంలోనే ఉండి పోలీసుల కదలికలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ హత్యపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు మర్రిగూడెంలో ఉన్న రజనిని అరెస్ట్ చేసి 16.5 తులాల బంగారు ఆభరణాలు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కడిపికొండ క్రాస్‌లో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ప్రవీణ్‌కుమార్ పట్టుబడ్డాడు.

ఇద్దరిది నేర చరిత్రే..

కాజీపేట రైల్వే ఎలక్ట్రికల్ షెడ్‌లో పని చేస్తున్న రజని, ప్రవీణ్‌కుమార్ 2013 నుంచి సహజీవనం కొనసాగిస్తున్నారు. కాగా, ప్రవీణ్‌కుమార్ తన భార్య రేణుకను అదనపు కట్నం కోసం వేధించడంతో ఆమె 2018లో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో రజని, ప్రవీణ్‌కుమార్ జైలుకెళ్లొచ్చారు. జైలులో సహ నిందితులతో పరిచయం ఏర్పడింది. వారి సూచనల మేరకు ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేయగా బసంత్‌నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దీంతో ఉద్యోగాలు పోవడంతో ఇద్దరు సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగనోట్ల వ్యాపారం చేస్తూ పోలీసులకు పట్టుబడగా సుబేదారి, మట్టెవాడ, పాలకుర్తి పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

రౌడీషీట్, పీడీ యాక్ట్ నమోదు ..

నిందితులు రజని, ప్రవీణ్‌కుమార్‌పై వెంటనే రౌడీషీట్ తెరవడంతోపాటు పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. కాగా, కేసు ఛేదనలో ప్రతిభకనబర్చిన సీఐ వై.సుధాకర్ రెడ్డి, ఎస్సైలు నవీన్‌కుమార్, సర్వేశ్వర్, సిబ్బంది శ్రీధర్, బి.భాస్కర్, విష్ణు, కె.శ్రీనివాస్‌ను ఏసీపీ అభినందించారు.

'స్థానికం' కోసం.. 'ముందస్తు'గా..


పార్లమెంట్ నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు

- టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు అవకాశం
- వరంగల్‌కు చిట్ల సత్యనారాయణ, మహబూబాబాద్‌కు పొట్ల నాగేశ్వర్‌రావు
- ఇతర జిల్లాల ఇన్‌చార్జ్‌లుగా ఓరుగల్లు నేతలు

సాక్షిప్రతినిధి, వరంగల్: స్థానిక సంస్థల ఎన్నికలు కొద్ది రోజుల్లో జరిగే అవకాశం ఉండగా.. అధికార కాంగ్రెస్ పార్టీ 'ముందస్తు'గా సిద్ధమవుతోంది. గ్రామస్థాయినుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అధిష్ఠానం సీనియర్‌లను రంగంలోకి దింపుతోంది. ఈ క్రమంలోనే టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఆ జాబితాను విడుదల చేశారు. ఇతర జిల్లాలకు చెందిన సీనియర్‌లను ఉమ్మడి వరంగల్‌కు నియమించిన టీపీసీసీ చీఫ్.. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్‌లకు ఇతర జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఒక్కో పార్లమెంట్ స్థానానికి ఒక ఉపాధ్యక్షుడు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులను నియమించారు. వరంగల్ (ఎస్సీ) పార్లమెంట్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్‌గా చిట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా దుద్దిళ్ల శ్రీనివాస్, పల్లె శ్రీనివాస్ గౌడ్, మోత్కూరి ధర్మారావు, మహబూబాబాద్ (ఎస్టీ)కి వైస్‌ప్రెసిడెంట్‌గా మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, బేబీ స్వర్ణకుమారి, నాగ సీతారాములులను నియమించారు. అదే విధంగా ఉమ్మడి వరంగల్ నుంచి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కరీంనగర్ పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను మల్కాజ్‌గిరి వైస్‌ప్రెసిడెంట్‌గా, హన్మాండ్ల ఝాన్సీరెడ్డికి సికింద్రాబాద్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. నల్లగొండకు నమిండ్ల శ్రీనివాస్‌ను వైస్‌ప్రెసిడెంట్‌గా నియమించిన అధిష్ఠానం.. ఈవీ శ్రీనివాస్‌రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలు భువనగిరి, ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామికి సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీలుగా బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతిని ప్రోగ్రాం ఇప్లిమెంటేషన్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జ్‌గా నియమించారు.

చికిత్స పొందుతూ వినోద మృతి

- కుంటపల్లిలో విషాదఛాయలు



వినోద (ఫైల్)

సంగెం: డబ్బు, ఆస్తి కోసం తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించగా ఎంజీఎంలో నాలుగు రోజులు మృత్యువుతో పోరాడిన ముత్తినేని వినోద(60) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. వినోద మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం వినోద మృదేహాన్ని కుంటపల్లి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. భర్త సాంబయ్య తలకొరివి పెట్టాడు. కాగా, కన్న కొడుకే కాలయముడై తల్లిని కర్కషంగా బతికుండగానే నరకం చూపించి కాటికి పంపిన సతీశ్ లాంటి కొడుకు పుట్టకపోయినా పర్వాలేదని బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. సతీశ్‌ను పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

అత్తింటి వేధింపులతో వివాహిత బలవన్మరణం

- పెగడపల్లిలో ఘటన

కాటారం(మహాముత్తారం): అత్తింటి వేధింపులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం పెగడపల్లికి చెందిన వావిళ్ల గుజరీత అలియాస్ లత(30)కు గతంలో రెండు వివాహాలు జరిగాయి. 2025 మార్చిలో ములుగు జిల్లా మంగపేట మండలం బుచ్చంపేటకు చెందిన ఎడ్ల శివతో కుటుంబ సభ్యులు మూడో వివాహం చేశారు. ఈ దంపతులు కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఉంటుండగా శివ తన భార్య గుజరీతపై అనుమానంతో ఇబ్బందులు పెడుతున్నాడు. ఈ విషయం గుజరీత తన కుటుంబీకులకు తెలపడంతో వారు భార్యాభర్తలకు నచ్చజెప్పారు. గొడవలు సద్దుమణిగే వరకు హైదరాబాద్‌లో ఉంటున్న తన అన్న చిరంజీవి ఇంట్లో ఉండటానికి శివ దంపతులు నిర్ణయించుకున్నారు. అయితే చిరంజీవి.. గుజరీతను లైంగిక ఇబ్బందులకు గురి చేయడంతో ఎవరికి చెప్పకుండా పెగడపల్లిలోని తన తల్లిగారి ఇంటికి వచ్చింది. దీంతో శివ, చిరంజీవి, కుటుంబీకులు జూన్ 30న పెగడపల్లి వచ్చారు. తమకు చెప్పకుండా ఎందుకు వచ్చావని గుజరీతను నిలదీశారు. చిరంజీవి వేధించిన విషయం గుజరీత తన భర్త, కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు ఆమెనే నిందించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మనస్తాపానికి గురైన గుజరీత అదే రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు.

తాళాలు వేసి ఉన్న క్వార్టర్స్ టార్గెట్‌గా..

కేటీపీపీలో భారీ చోరీ

- ఒకే రాత్రి 10 ఇళ్లలో రూ.3.10 లక్షల నగదు అపహరణ
- పటిష్ట భద్రత ఉన్నా చోరీ జరగడంపై అనుమానాలు
- ఘటనా స్థలిని పరిశీలించిన డీఎస్పీ సంపత్ రావు



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

గణపురం : తాళాలు వేసి ఉన్న క్వార్టర్స్ టార్గెట్‌గా కేటీపీపీలో భారీ చోరీ జరిగింది. పటిష్ట భద్రత కలిగి ఉండే జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం(కేటీపీపీ) క్వార్టర్స్‌లో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఈ ఘటనలో రూ. 3.10 లక్షల నగదుతో పాటు కొన్ని విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్లు సమాచారం. చోరీ జరిగిన క్వార్టర్స్‌లో ఎవరూ లేకపోవడంతో మంగళవారం ఉదయం గుర్తించిన చుట్టుపక్కల వారు బాధితులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అందుబాటులో ఉన్న కొంత మంది ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్వార్టర్స్ నంబర్ సీ9, సీ12, డీ12, డీ37, డీ40, డీ55, డీ117, ఈ6, ఈ56, ఈ79 బ్లాక్‌లలో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇందులో డీ12 క్వార్టర్స్‌లోని ఏడీఈ వంశీధర్ ఇంట్లో రూ. 3 లక్షల నగదు, డీఈ తిరుపతి గౌడ్ ఇంట్లో రూ. 10వేల నగదు చోరీ గురైందని ఫిర్యాదు చేశారు. మిగతా ఉద్యోగుల క్వార్టర్స్‌లలో విలువైన ఆభరణాలు పోయినట్లు సమాచారం. మిగతా వారు వచ్చి తమ క్వార్టర్స్‌లలో ఏ వస్తువు చోరీ జరిగిందో చూస్తే తప్ప పూర్తి వివరాలు తెలియదు. ఘటనా స్థలిని భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేశ్, గణపురం ఎస్సై అశోక్ పరిశీలించి ఆధారాలు సేకరించారు.

24 గంటలు భద్రత.. చోరీ ఎలా జరిగింది?

కేటీపీపీ క్వార్టర్స్‌లో సుమారు వెయ్యి మందికి పైగా ఉద్యోగుల కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇందులో సీఈ స్థాయి నుంచి ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఇంజనీర్లు, జేపీఏ,ఆర్టిజన్‌లు కుటుంబాలతో నివాసముంటున్నారు. ఇక్కడ జెన్‌కో సెక్యూరిటీ బయటి వారిని లోపలికి వెళ్లకుండా ప్రతిక్షణం రక్షణ చర్యలు తీసుకుంటుంది. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ ఇంత భద్రత ఉన్నా ఒకే రాత్రి 10 క్వార్టర్స్‌లో చోరీ జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సెక్యూరిటీ విభాగం కాలనీల్లో గస్తీ నిర్వహిస్తారు. అయినా బయటి వారు ఎలా లోపలికి చొరబడ్డారు. తాళాలు వేసి ఉన్న క్వార్టర్స్‌నే ఎలా గుర్తించారు. ఇదేమైనా ఇంటి దొంగల పనేనా అని పలువురు చర్చించుకుంటున్నారు. మొత్తానికి కేటీపీపీలో ఒకే రోజు 10 క్వార్టర్స్‌లో చోరీ జరగడం సంచలనంగా మారింది. ఈ చోరీని పోలీసులు ఎలా ఛేదిస్తారో వేచి చూడాలి.